సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348


# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు







బుధవారం 22 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 324 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్




## మహనీయుల ఆలోచనలతో ముందుకు సాగాలి – మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రతినిధి: సచివాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నిర్వహించిన సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వహిస్తూ మహనీయుల ఆలోచనల మేరకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయంలో పని చేస్తున్న 320 మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని తెలిపారు. అంబేద్కర్ సూచించిన విధంగా విద్య ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అదే దిశగా ముందుకెళ్తున్నారని వివరించారు. లోయర్ ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డాలో లైబ్రరీ, హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. సచివాలయంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అంశంపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ముఖ్యమంత్రితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు, సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 22 రాష్ట్రవ్యాప్తంగా ముఖ్య వార్తలు – పర్యాటకం, పరిపాలన, విద్య, వ్యవసాయం, రాజకీయాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్/రాష్ట్రం, ఏప్రిల్ 22, ప్రతినిధి: రాష్ట్రంలో మంగళవారం పర్యాటకం, పరిపాలన, విద్య, వ్యవసాయం, ప్రజా సమస్యలపై కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. నీతి ఆయోగ్ విడుదల చేసిన 'దివ్య భారత్' పర్యాటక నివేదికలో తెలంగాణ రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు లభించడంపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేస్తూ ఇది రాష్ట్ర గర్వకారణమని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్, గోల్కొండ కోట, యాదాద్రి, భద్రాచలం, కుంటాల, బొగత జలపాతాలు, మేడారం జాతర, పోచంపల్లి ఇక్కత్ వంటి పర్యాటక, సాంస్కృతిక కేంద్రాలు రాష్ట్ర ఖ్యాతిని పెంచుతున్నాయని తెలిపారు. మరోవైపు విద్యా రంగంలో సంక్షేమ గురుకుల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కొనసాగుతుండగా, జనగణన 2027 సన్నాహక సమావేశాల్లో ఇంటి గణన, వ్యక్తిగత గణనపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. పరిపాలన పరంగా కలెక్టర్ ఆకస్మిక గ్రామ సందర్శనలో అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ పరిస్థితులు పరిశీలించబడ్డాయి. రైతు సమస్యలపై వడగండ్ల వానతో పంట నష్టపోయిన వారికి తక్షణ పరిహారం ఇవ్వాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో తాత్కాలిక చర్యలు చేపట్టగా, రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ విలీనం, ఇందిరమ్మ బీమా, ఎన్నికల సన్నాహాలు వంటి కీలక అంశాలు చర్చకు రానున్నాయి. అలాగే చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందించగా, ఉపాధి హామీ పనుల్లో నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్షలు కొనసాగాయి. రాజకీయంగా వివిధ జిల్లాల్లో సమావేశాలు, చేరికలు, విమర్శలు, జన్మదిన వేడుకలు కొనసాగాయి. మొత్తం మీద రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పాలనాపరమైన నిర్ణయాలు ఒకే రోజులో విస్తృతంగా చోటుచేసుకున్నాయి.




## భూ వివాదాల పరిష్కారంలో సువర్ణాధ్యాయం కుసుమంచిలో తొలి రిజిస్ట్రేషన్

సందేశం టైమ్స్, కుసుమంచి, ఏప్రిల్ 22, ప్రతినిధి: భూ వివాదాల పరిష్కారంలో సువర్ణాధ్యాయంగా నిలిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలంలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. రైతు భూమిపై హక్కు స్పష్టంగా ఉంటేనే అతని జీవితం భద్రంగా ఉంటుందని, అందుకే భూధార్ నెంబర్‌తో శాశ్వత భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూ భారతి పోర్టల్ ద్వారా రెవెన్యూ వ్యవస్థను సమూలంగా బలోపేతం చేస్తున్నామని వివరించారు. కుసుమంచి మండలం గట్టు సింగారం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 156/ఇ/1లో ఒక ఎకరం నాలుగు గుంటల భూమికి సంబంధించిన విక్రయ రిజిస్ట్రేషన్ సర్వే మ్యాప్‌తో పాటు నిర్వహించగా, భూధార్ నెంబర్ కేటాయించబడింది. ఈ విధానాన్ని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి చట్టం ద్వారా భూ వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత తీసుకొచ్చి ప్రతి భూమికి ఖచ్చితమైన సర్వే మ్యాప్, ప్రత్యేక భూధార్ నెంబర్ అందిస్తున్నామని తెలిపారు.



## మెడికల్ డివైసెస్ ఉత్పత్తికి తెలంగాణ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు – మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రతినిధి: అత్యాధునిక వైద్య పరికరాల ఉత్పత్తికి తెలంగాణలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం సచివాలయంలో నెదర్లాండ్స్ మెడిటెక్ పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీల పరిశోధకులతో సమావేశమైన ఆయన మెడికల్ డివైసెస్ పార్క్, జీనోమ్ వ్యాలీలో ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. వైద్య పరిశోధనలు, కృత్రిమ మేధ అభివృద్ధి, వైద్య పరికరాల తయారీకి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రమని పేర్కొన్న ఆయన ఔషధ ఉత్పత్తి, వ్యాక్సిన్ తయారీ, నూతన ఆవిష్కరణల్లో రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో తెలంగాణ బయోటెక్ సంస్థలు 120 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మెడికల్ డివైసెస్ రంగాన్ని ప్రపంచస్థాయి హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. విద్యుత్, నీరు, భూమి సమృద్ధిగా ఉండటంతో పాటు నైపుణ్య మానవ వనరులు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇమేజింగ్ టెక్నాలజీ, క్లినికల్ వ్యాలిడేషన్, డిజిటల్ ప్రొఫైల్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. నెదర్లాండ్స్ ప్రతినిధి జాన్ రెయింట్ స్మిట్ నేతృత్వంలోని బృందం సమావేశంలో పాల్గొనగా, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా హాజరయ్యారు.

## ఏప్రిల్ 22 రాష్ట్రవ్యాప్తంగా ముఖ్య సంఘటనలు – విద్య, వ్యవసాయం, పరిపాలన, రాజకీయాలు, ప్రజా సమస్యలు

సందేశం టైమ్స్, మెదక్/సంగారెడ్డి/హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం విద్య, వ్యవసాయం, పరిపాలన, రాజకీయ రంగాల్లో పలు కీలక ఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి సూచించగా, ప్రవేశ పరీక్ష మే 15న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో మెదక్ జిల్లాలో జనగణన 2027 సన్నాహక సమావేశంలో సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పరికరాల పంపిణీ చేసి ఇంటి గణన, వ్యక్తిగత గణనను ఖచ్చితంగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. మరోవైపు చంద్ర తాండ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ గ్రామ అభివృద్ధి, తాగునీటి సమస్యలు, వ్యవసాయం, సేంద్రియ కూరగాయల తోటలను పరిశీలించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అలాగే అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల రక్షణ, సైబర్ మోసాలపై న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. చేనేత కార్మికులకు తొలి త్రైమాసిక బీమా చెక్కులు పంపిణీ చేయగా, రైతు భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించారు. మెదక్ జిల్లాలో వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం హాస్టళ్లలో సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రాయికోడ్ ప్రాంతంలో విషపూరిత ద్రావణం తాగి ఎద్దు మృతి చెందడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. నారాయణఖేడ్ డిపోలో ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో తాత్కాలిక కండక్టర్ల నియామకం చేపట్టగా, రేపటి నుంచి బస్సు సేవలు నిలిచే అవకాశం ఉన్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ విలీనం, ఇందిరమ్మ బీమా, పంట నష్టం, ఎన్నికల సన్నాహాలపై కీలక చర్చ జరగనుంది. రాజకీయంగా వివిధ పార్టీల సమావేశాలు, చేరికలు, విమర్శలు కొనసాగాయి. రైతులు మొక్కజొన్న కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని రాస్తారోకో నిర్వహించారు. అలాగే వివిధ జిల్లాల్లో ఎమ్మెల్యేలు, నాయకుల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వక భేటీలు నిర్వహించారు. మొత్తం మీద రాష్ట్రంలో ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనాపరమైన చర్యలు ఒకే రోజు విస్తృతంగా కొనసాగినట్లు ఈ రోజు సంఘటనలు వెల్లడిస్తున్నాయి.

## సీఎం రేవంత్ రెడ్డితో ఆదాయపు పన్ను ఉన్నతాధికారుల మర్యాదపూర్వక భేటీ – సచివాలయంలో నెదర్లాండ్స్ ప్రతినిధికి మంత్రి సన్మానం





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రతినిధి: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని జూబ్లీ హిల్స్ నివాసంలో తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని మరియు ఇతర ఉన్నతాధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిపాలన, పన్నుల వ్యవస్థ సమన్వయం, ఆర్థిక నిర్వహణ అంశాలపై సౌజన్య భేటీ జరిగినట్లు సమాచారం. మరోవైపు సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నెదర్లాండ్స్ ఇన్నోవేషన్స్ కౌన్సిలర్ జాన్ రెయింట్ స్మిట్‌ను సన్మానించారు. తెలంగాణలో పెట్టుబడులు, మెడిటెక్, బయోటెక్, నూతన ఆవిష్కరణల రంగాల్లో సహకార అవకాశాలపై ఇరువురు చర్చించారు. రాష్ట్రాన్ని గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అంతర్జాతీయ భాగస్వామ్యాలు మరింత బలోపేతం అవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# సికింద్రాబాద్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎం.ఏ తెలుగు విద్యార్థుల ఘన వీడ్కోలు



సికింద్రాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఏప్రిల్ 22: సికింద్రాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో ఎం.ఏ తెలుగు విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్యారడైజ్ పీజీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా రచించిన "మా ఊరు జీవన స్వరం" కవితా-వ్యాస సంకలనాన్ని తెలుగు విభాగాధ్యక్షులు ఆచార్య వై.ఎస్. రజిని ఆవిష్కరించగా, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధ్యక్షులు ఆచార్య ఆకుమూర్తి నాగేశ్వరరావు తొలి ప్రతిని స్వీకరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలుగు వన్ చానల్ సీఈఓ దుర్గాప్రసాద్ పాల్గొనగా, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పుస్తక రూపకల్పనలో సమన్వయకర్తగా వ్యవహరించిన డాక్టర్ సుధాకర్ బట్టను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిగిచెర్ల కృష్ణారెడ్డి, డాక్టర్ బోనాల మురళి, డాక్టర్ మారోజు దేవేంద్ర, డాక్టర్ మహేందర్ గిన్నారావు, ఆదినారాయణరావుతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వడగండ్ల వాన నష్టానికి రైతులను ఆదుకోవాలి



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 22, ప్రతినిధి: వడగండ్ల వాన కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలతో వరి, మామిడి పంటలు వందల ఎకరాల్లో దెబ్బతిన్నాయని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కోత దశలో ఉన్న పంటలు చివరి సమయంలో నష్టపోవడంతో రైతులు అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం చెల్లించాలని, కోసిన వరి పంటను తక్షణమే కొనుగోలు చేసి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.



# విద్యతోపాటు సామాజిక అంశాల్లో అవగాహన పెంపొందించాలి

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 22, ప్రతినిధి: విద్యతోపాటు సామాజిక అంశాలపై కూడా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా టేక్మాల్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఆమె పరిశీలించి స్టోర్ గది, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీయడానికి క్విజ్ పోటీలు, బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు, వీధి నాటకాలు, చర్చలు, ప్రసంగాలు, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రియా యాయుద్దీన్, పంచాయితీ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్ర తాండలో అభివృద్ధి, నీటి సమస్యలపై కలెక్టర్ ఆకస్మిక పరిశీలన



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 22, ప్రతినిధి: మెదక్ జిల్లా చంద్ర తాండ గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మికంగా పర్యటించి గ్రామ అభివృద్ధి, తాగునీటి సమస్యలు, వ్యవసాయ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్ర తాండలోని ఆర్గానిక్ కూరగాయల తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ గైర్హాజరుతో ఇందిరమ్మ ఇళ్ల అంశంపై సర్పంచ్ శ్రవంతి సర్దార్ వివరాలు తెలియజేయగా, గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంప్రసాద్, ప్రవీణ్ హౌసింగ్ ఏఈ, వీఆర్ఓ రమేష్, ఉప సర్పంచ్ శాంతిబాయి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాదవ్ సంతోష్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ చందర్, ఫీల్డ్ అసిస్టెంట్ మోటిలాల్, తాండ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా ప్రచురితమైన బంజారా సంస్కృతి పుస్తకాన్ని డాక్టర్ రమేశ్ ఆర్యా కలెక్టర్‌కు అందజేయగా, బంజారా జాతి గొప్పతనం, సంప్రదాయాలపై వివరాలు అందించారు.

# సంక్షేమం-ధాన్యం కొనుగోళ్లు-ఇందిరమ్మ ఇళ్లు-పాఠశాలలు, పోషణ్ కార్యక్రమాలపై కలెక్టర్ దృష్టి





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 22, ప్రతినిధి: జిల్లాలో సంక్షేమ వసతి గృహాల సమస్యల పరిష్కారం, ధాన్యం కొనుగోళ్ల వేగవంతం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రెసిడెన్షియల్ పాఠశాలల పూర్తి, చిన్నారుల పోషణ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమగ్రంగా దృష్టి సారించారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా ఇమాంపేట కేజీవిబి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ వసతి గృహాల్లోని సమస్యలపై తక్షణమే నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశిస్తూ, వేసవి సెలవుల్లో రిపేర్లను పూర్తి చేయాలని సూచించారు. మెస్ కమిటీలు రిజిస్టర్ సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేస్తూ కేజీవిబిలో ఫ్యాన్లు, చిన్నపాటి మరమ్మతుల కోసం రూ.50వేలు విడుదల చేశారు. ఇదే సమయంలో కోదాడ మండలం తమ్మరబండపాలెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రోజుకు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు తాగునీరు, నీడ, తేమ కొలిచే యంత్రాలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి లారీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. మరోవైపు హుజూర్నగర్‌లో రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ కాలనీ పనులను వేగంగా పూర్తి చేసి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడిస్తూ, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సూచించారు. చిలుకూరు మండలంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా యాండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించగా, పోషకాహారం ద్వారా పిల్లల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెరుగుతుందని అధికారులు వివరించారు.

# ప్రవేశాలు-పరిశీలనలు-పర్యావరణం-చట్ట అవగాహన-నేతన్న భరోసా చెక్కుల పంపిణీపై జిల్లాలో కార్యక్రమాలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 22, ప్రతినిధి: జిల్లాలో విద్య, పరిపాలన, పర్యావరణం, చట్ట అవగాహన, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా, ఏప్రిల్ 25 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి జి.కల్పన సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి మహిళా శక్తి పెట్రోల్ బంక్‌ను పరిశీలించి పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, పారదర్శకతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో హత్నూర గ్రామంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య బాల్య వివాహాల నిర్మూలనకు చట్టాలపై అవగాహన అత్యవసరమని, పాక్సో చట్టం, గృహ హింస చట్టం వంటి నిబంధనలను వివరించారు. మరోవైపు నేతన్న భరోసా పథకం కింద జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పాండు చేతుల మీదుగా 31 మంది చేనేత కార్మికులకు రూ.97,500 విలువైన చెక్కులను పంపిణీ చేసి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



# జనగణన 2027 బాధ్యతాయుతంగా పూర్తి చేయాలి

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 22, ప్రతినిధి: జనగణన 2027ను సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోలీకెరీ పేర్కొన్నారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జనగణ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, డిజిటల్ విధానం, స్వీయ గణన ప్రక్రియపై వివరించారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశలో ఇండ్ల గణన, ఫిబ్రవరి 2027లో రెండో దశలో వ్యక్తిగత వివరాల సేకరణ జరుగుతుందని తెలిపారు. ప్రతి కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి గోప్యతను కాపాడాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 26న స్వీయ గణనలో పాల్గొనాలని, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మె నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 22, ప్రతినిధి: ఆర్టీసీ జేఏసీ ఈనెల 22 నుంచి చేపట్టనున్న సమ్మెను నివారించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలుగురైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వ హామీతో సమ్మెను విరమించుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించకపోవడం కార్మికులను మోసగించడం అని ఆయన ఆరోపించారు. సమ్మె సమయం దగ్గర పడుతున్నా నాయకులను చర్చలకు కూడా పిలవకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో ఎక్కువ మంది సామాన్యులు, రైతు కుటుంబాల వారేనని పేర్కొంటూ, సమ్మె వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే పరిష్కారం చూపి బస్సులు యథావిధిగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.




## ఎం.ఏ తెలుగు విద్యార్థులకు ఘన వీడ్కోలు కార్యక్రమం

సందేశం టైమ్స్, సికింద్రాబాద్, ఏప్రిల్ 22, ప్రతినిధి: సికింద్రాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో ఎం.ఏ తెలుగు విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్యారడైజ్ పీజీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రచించిన "మా ఊరు జీవన స్వరం" కవితా-వ్యాస సంకలనాన్ని తెలుగు విభాగాధ్యక్షులు ఆచార్య వై.ఎస్. రజిని ఆవిష్కరించగా, తొలి ప్రతిని ఆచార్య ఆకుమూర్తి నాగేశ్వరరావు స్వీకరించారు. ముఖ్య అతిథిగా తెలుగు వన్ చానల్ సీఈఓ దుర్గాప్రసాద్ పాల్గొనగా, కార్యక్రమానికి డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పుస్తక రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ సుధాకర్ బట్టను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిగిచెర్ల కృష్ణారెడ్డి, డాక్టర్ బోనాల మురళి, డాక్టర్ మారోజు దేవేంద్ర, డాక్టర్ మహేందర్ గిన్నారావు, ఆదినారాయణరావు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు

## విషపూరిత ద్రావణం తాగి ఎద్దు మృతి – రైతు కుటుంబం ఆవేదన



సందేశం టైమ్స్, రాయికోడ్, ఏప్రిల్ 22, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కుసునూరు గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గోపాల్ రెడ్డికి చెందిన ఎద్దు విషపూరిత ద్రావణం తాగి మృతి చెందింది. గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న బోర్ వద్ద డ్రమ్ములో యూరియా కలిపిన గడ్డి మందును నిర్లక్ష్యంగా ఉంచినట్లు సమాచారం. దాహంతో ఉన్న ఎద్దు ఆ ద్రావణాన్ని తాగడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ డ్రమ్మును గ్రామానికి చెందిన ఈర్స సంగణ పటేల్ ఉంచినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, ఆయన మాత్రం తనకు సంబంధం లేదని చెబుతూ బాధితులను బెదిరించినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ ఘటనపై గ్రామ సర్పంచ్ రాజశేఖర్ స్పందించకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎద్దు మృతి చెందడంతో గోపాల్ రెడ్డి కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడగా, వ్యవసాయానికి కీలకమైన ఎద్దును కోల్పోవడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే దహన సంస్కారాలు నిర్వహించిన కుటుంబం తీవ్ర విషాదంలో ఉంది. బాధిత కుటుంబానికి తక్షణ నష్టపరిహారం అందించి, నిర్లక్ష్యంగా విషపదార్థం ఉంచిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఆర్టీసీ సమ్మెతో రాష్ట్ర రవాణాపై ప్రభావం




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించడంతో ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితులు నెలకొన్నాయి. కార్మిక సంఘాల జేఏసీ ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నుంచే బస్సులు డిపోలకే పరిమితం కానుండగా, బుధవారం ఉదయం నుంచి సమ్మె పూర్తిస్థాయిలో ప్రారంభమవుతుంది. ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీలు లేకపోవడం వల్ల సమ్మె అనివార్యమైందని కార్మికులు పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాలపై నిషేధం ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం వంటి ప్రధాన డిమాండ్లపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చర్చలకు పిలవకపోతే సమ్మె కొనసాగుతుందని హెచ్చరిస్తూ, ఇతర కార్మిక సంఘాలు కూడా మద్దతు ప్రకటించడంతో రాష్ట్రంలో రవాణా సేవలు దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో తాత్కాలిక కండక్టర్ల నియామకం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 22, ప్రతినిధి: ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ డిపో పరిధిలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సేవలను కొనసాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాత్కాలికంగా కండక్టర్ విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లతో ఏప్రిల్ 22 ఉదయం నారాయణఖేడ్ డిపోకు హాజరై డిపో మేనేజర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

## ఉపాధి హామీ పనుల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



సందేశం టైమ్స్, కంగ్టి మండలం, ఏప్రిల్ 22, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని దెగుల్‌వాడి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం కూలీలు ఉదయం పని ప్రారంభంలో ఒకసారి, పని ముగిసిన తర్వాత మరోసారి ఫోటోలు తీసుకోవాలని సూచించారు. రెండు ఫోటోలు నమోదు చేసినప్పుడే హాజరు పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని, కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు.



## మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్ – కాంగ్రెస్‌పై విమర్శలు

సందేశం టైమ్స్, అందోల్ మండలం, ఏప్రిల్ 22, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మండల అధ్యక్షుడు లక్ష్మికాంతరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కనసాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు బిఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమైందని పేర్కొంటూ రైతుబంధు, దళితబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు లాభం చేకూరిందని వివరించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, మళ్లీ బిఆర్ఎస్ పార్టీకి అధికారం అప్పగించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నారాయణ, బాలయ్య, మాజీ సర్పంచ్‌లు శేరి మాణిక్‌రెడ్డి, లింగన్న, వెంకటేశం, గ్రామ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు మాధవరెడ్డి, శివచందర్, మల్లమ్మ భూమయ్య, నాయకులు ధీరజ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంగమేశ్వర్, శంకర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, నాగేష్, ఆసీఫ్, జోగినాథ్, అహ్మద్, రవీందర్, ప్రభు, నవీన్, రవి, జోగయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న కొనుగోళ్లపై నాగులవంచలో రైతుల రాస్తారోకో

సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 22, ప్రతినిధి: మొక్కజొన్నకు విధించిన 26 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేసి రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై నాగులవంచలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన ఈ నిరసనతో రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలను తరలించేందుకు సరిపడా లారీలను ఏర్పాటు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ వీరేందర్, సొసైటీ సీఈఓ యాలమూడి శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని రైతు నాయకులతో చర్చలు జరిపి హామీ ఇవ్వడంతో రాస్తారోకోను రైతులు విరమించారు.

## కేంద్ర మంత్రిని కలిసిన కొండా గోపి



సందేశం టైమ్స్, కరీంనగర్, ఏప్రిల్ 22, ప్రతినిధి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కొండా గోపి మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీలో పరస్పర అభివాదాలు మార్చుకున్నారు. అనంతరం ఇద్దరూ కలిసి నగరంలోని శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# గాయపడిన బిఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 22, ప్రతినిధి: చింతకాని మండలం కొదుమూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు బొగ్గారపు రాంబాబు ఇటీవల స్వల్ప గాయంతో శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయనను జడ్పీ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చింతకాని మండల నాయకులు గురజాల హనుమంతరావు, బొడ్డు వెంకట రామయ్య, బోనకల్లు మండల నాయకుడు వడ్డె నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# పటాన్‌చెరు అభివృద్ధిపై మంత్రి దామోదర్ రాజనర్సింహతో కాటా శ్రీనివాస్ గౌడ్ భేటీ

సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 22, ప్రతినిధి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం అంశాలపై విస్తృతంగా చర్చించారు. స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# హట్టహాసంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 22, ప్రతినిధి: సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా, హట్టహాసంగా నిర్వహించబడ్డాయి. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొనగా పట్టణం అంతటా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరయ్యారు. మండలాల వారీగా వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి రక్తదాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యక్షంగా, సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# గంజి చంద్రమౌళి మృతి పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతాపం

సందేశం టైమ్స్, హుజూర్‌నగర్, ఏప్రిల్ 22, ప్రతినిధి: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంజి చంద్రమౌళి మృతి పట్ల రాష్ట్ర భారీ నీటి పారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలో తొలి ఫంక్షన్ హాల్ స్థాపించి విజయవంతమైన వ్యాపారవేత్తగా, అలాగే తనకు కష్టకాలంలో తోడుగా నిలిచిన సన్నిహిత మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. మృతుడి కుమారుడు గంజి శివతో పాటు కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గంజి చంద్రమౌళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# సంగారెడ్డిలో కాంగ్రెస్ పీఏసీ సమావేశం నిర్వహణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 22, ప్రతినిధి: సంగారెడ్డిలో డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతంపై కీలక సూచనలు చేశారు. జిల్లాలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించడం, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు సిద్ధం చేయడం, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 22, ప్రతినిధి: సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదినం సందర్భంగా సదాశివపేటలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరై చింత ప్రభాకర్‌తో కలిసి కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సేవలో ఆయన చూపుతున్న నిబద్ధతను ప్రశంసిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

సందేశం టైమ్స్, కంగ్టి, ఏప్రిల్ 22, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య గారు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ గర్వకారణమని, ఆయన ఆశయ సాధనకు విద్య, సంఘటిత శక్తి అవసరమని తెలిపారు. బక్కి వెంకయ్య గారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి అమూల్యమని, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కమిషన్ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, వివిధ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# దేశంలో తొలి ప్రైవేట్ బంగారు గని ప్రారంభం – ఏపీలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం



సందేశం టైమ్స్, కర్నూలు, ఏప్రిల్ 22, ప్రతినిధి: దేశంలో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో బంగారు గని ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. కర్నూలు జిల్లా జొన్నగిరి ప్రాంతంలో జియోమైసూర్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో 598 హెక్టార్ల విస్తీర్ణంలో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించగా, ఇక్కడ సుమారు 13.1 టన్నుల బంగారు నిల్వలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 2027 నాటికి సుమారు 600 కిలోల బంగారం ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా, పూర్తి స్థాయిలో ఏటా 1000 కిలోల వరకు ఉత్పత్తి సాధ్యమని అంచనా వేస్తున్నారు. 15 సంవత్సరాల దీర్ఘకాలిక ప్రాజెక్ట్‌గా ఇది కొనసాగనుండగా, స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఇప్పటివరకు బంగారు గనులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండగా, ఇది దేశంలో ప్రైవేట్ రంగంలో తొలి ప్రయత్నంగా గుర్తింపు పొందింది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికి రాయల్టీ ఆదాయం, పారిశ్రామిక అభివృద్ధి మరియు ఉద్యోగ అవకాశాలను పెంచుతుందని అధికారులు పేర్కొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.